# మల్లెమొగ్గల గొడుగు

## అంటరానోళ్ళ ఆత్మఘోష

## బతుకులు–మెతుకులు

నేను కనిగిరి సెంటర్లో నడుసుకుంటా బోతా వుండంగా, ఓ సార్! సార్! అని ఎవరో యనకనుంచి అరుస్తా వుండరు. నేను యెనక్కి దిరిగి చూసి యింత జనంలో ఎవుర్నోలే అనుకోని మల్లీ ముందుకి నడస్తుండా. మల్లీ సపట్లు గొడతా "సుదయ్యా సారూ! ఇటు పక్క జూడు" అంటా వున్నరు.

ఎవురో వొకాయిన ఎర్రంగ పొడగ్గా వుండి చిన్న టీకొట్టు ముందు నిలబడి నన్నేపిలస్తా వున్నడు.

ఇంగ నేను దెగ్గిరికి బయ్యి 'ఎవరు నువ్వు?" అనడిగినా.

మనుసులో మాత్తరం ఎవురో మా వూరోల్లే అయుంటర్లే అనుకున్న.

"నేలటూరి రాజారావుని గదూ! నేన్నీకు దెలియ దుగానీ నువ్వు నాకు దెలుసులే సార్! ఎండ్లూరి దేవయ్య మామ కొడుకువి గదా! కయిగట్టే వోడి వంట గదా! నిన్ను మనూరి పెల్లిలో జూసినా!" అన్నాడు సంబరంగా.

"అట్టనా రాజారావూ! అయితే నువ్వేంది నన్ను సార్ అంటుండవు. మనం సుట్టాలం గదా! అన్నా.

"నువ్వు సదువుకున్నోడివి. నీటుగుండే వోడివి. నిన్ను "సారే అనాల" అన్నడు. "అదంతా వొద్దుగానీ, ఈడుండవేఇంది?" అనడిగినా.

"రా సెప్తా. అని నన్ను టీకొట్టు లోపలికి దీసక బొయ్యి చిన్న చెక్క బల్లమీద కూసోబెట్టినాడు.

'యేదో బతుకు దెరువు. టీకొట్టు సొంతంగా బెట్టుకున్నా".

"మనోల్లల్లో టీకొట్టు మెట్టినోడివి నువ్వొక్కడివే గావాల! ఈడోల్లకి నీ కులం దెలియలా?" అనడిగినా.

"మనూరి పెద్దోల్లు టవున్లోకొస్తే నాకాడకి రాకుండా సొలిచ్చుకుంటరు. నేనెవురో తెలియ నోల్లు మాత్తరం నేరుకొచ్చి టియ్యి దాగి బోతరు. రెడ్లేమి? సెట్లేమి? ఆల్లేమి ఈల్లేమి? తెలిస్తేనే కులం. తెలియకుంటే పలం"

ఇంగ నేనేం మాట్లడకుండా అట్టనే ఆలోశన్లో బడ్డా. రాజారావు మాత్తరం కదుపులో యేదనంతా కక్కుతున్నడు.

"వూరు మారింది గానీ మా గతి మారలా! యాడోల్లమాడనే వున్నము. సుబ్బరంగ యాగాడు తున్నము. సెంటు రాస్తున్నము. జెండూ బాము రాస్తున్నము. సుబ్బరంగ వొంటికి సబ్బు బూస్తు న్నము. ఇంత జేసుకోని వూల్లేకి బోతమా! ఆడికి బోతంగానే కూటికి లేనోడికి గూడ మాదిగోన్ని సూడంగానే దూరం దూరం అంటున్నడు. వూళ్ళోకి మాలోడు బొయ్యినా చాన్సుంది. దొమ్మరోడు బొయ్యినా చాన్సుంది. పాములోడు బొయ్యినా చాన్సుంది. ఎడ్డోడు బొయ్యినా గూడ చాన్సుంది. మరి మనం బోతే ఎందుకొద్దంటున్నరు?

యే కులంలో బుట్టినా బాదలుండవ్. మనమే బాదల్లో వుడుతున్నం. ఇంతకీ మనం జేసిన తప్పేంది సార్! శాతయితే ఎవుర్నన్నా జబాబు జెప్పమను.

మనకి లేని బూములు రెడ్డిగోర్లకి ఎట్టావొచ్చి నయ్యి. యింగొకరికెట్టా వొచ్చినయ్యి. ఈ దేసంలో పొలాలకి కులాలుండై. కులాలకీ పొలాలుండై. దైర్నమనేదుంటే గవుర్నమెంటోల్లని ఈ రెంటినీ రద్దు జెయ్యమనండి" ఆయేసంతో అన్నడు.

ఎవురో టీ దాగదామని వొచ్చినారు. వోలకి టీ గవిపిచ్చి చినిన అరిటాకు ముక్కలో రొండు మసాలా వడలు, రొండు బజ్జీలు యేసకొచ్చి నా సేతిలో బెట్టినాడు.

"ఇయ్యి నా భార్య ఇంటికాడ వొండుకోనూస్తది సార్! బాగుంటది దిను" అన్నడు. ఇంక నేను సెట్నీలో అద్దుకోని తింటావున్న. నాకు మాత్తరం పెద్ద వోటల్లలో తిండికీ దీనికీ రుచిలో తేడా యేం గానరాలా!

వొచ్చినోల్లు టియ్యి దాగి డబ్బులిచ్చి ఎల్లిపోయి నంక రాజారావు నాకాడికొచ్చి కూసున్నడు.

"సార్! జీవితం గురించి చెప్పకోబడితే శానా వుండయ్యి. కదుపులో పేగులు వొకదానికొకటి తెలియకుండా దుక్కపడతా వుంటయ్యి. యెంత సంపాయిచ్చినా గూడా లాస్టికి యాడకి? మట్లేకి బోవాల్సిందే గదూ!

నీరూ మట్టే కలవందే జనమే లేదు. యిది దెలిసినోడికి కులమేదుంది? పొలమేదుంది? ఈ కులమనేది పోవాల.

పత్తీ పెద్దకులపోడు నా కొట్టు కాడికచొచి టిపిని జెయ్యాల సార్! ఆ రోజులొస్తయ్యా? మనుసులం దురూ కవిసుంటరా? ఇరవయ్యి సమచ్చరాలుగా యీ పని జేస్తుండా. ఇప్పటికి రోజులు మారలలా! నేను దెలిసినోల్లు యిాడికి రారు. వొచ్చినోల్లని మరేదగా జూస్తము. మరేదగా సాగనంపుతము.

యిది టవును గాబట్టి సరిపోయ్యింది. అదే వూల్లేనయితే నన్ను టీ బొంకు పెట్టనిస్తరా? పెట్టినా ఎవురన్నా వొస్తరా? వూల్లో మనోల్లు యాపారం

17-1-97, ఆంధ్రజ్యోతి సచిత్ర వారపత్రిక



జెయ్యలేరు.

మనూల్లో సెట్టిగారి వోటల్లో మనోల్లకి పేపర్లలో టిపిను కట్టిస్తరు తెలుసా సార్! అన్నడు రగస్యం జెప్పినట్టు.

'పెద్దకులపోల్లకి మాత్తరం ప్లేట్లలో పెడతరు" అన్నాడు మల్లీ. నేను రావంత యిచ్చింత్రంగ జూసి ఇట్టన్నా.

"అయితే రాజారావా! పట్నాలల్లో 'బ్రాహ్మణ కాఫీ, భోజన హోటల్, 'రెడ్డి మెస్' అని కులాల పేర్లతో వోటల్లు పెట్టుకున్నరు గదా? అదేమాదిరి 'మాదిగ కాఫీ భోజన హోటల్' అని పెడితే ఎట్టుంటది?' అనడిగినా.

రాజారావు నన్ను జూసి నా సేతిలో ఆకుదీసి గంపలో యేసి సెయ్యి కనుక్కోను నీల్లిచ్చినాదు.

"యెందుకు జరగదు?" అన్నా నీల్లు తాగతా.

"ఊడ కులానికొక్క వోటలుంటది సార్. పెద్ద కులపోల్లవి పెద్ద ఎద్ద మిద్దెల వోటల్లుంటయ్యి. మనం వోటలు పెడితే ఎవురొస్తరు? ఎవురన్నా వొచ్చినా గూడ పెద్దోల్లు గమ్మునండరు.

"యాందిరా? మాదిగ నాకొడకా! నువ్వు అంత మాత్తరమోడివా? నీ అదికారమెంత? నీ వెలు వెంత? ముందు నీకులం జూసుకో' అని కసిరి తిట్టే వోల్లే వున్నరు గానీ 'రాంఢిరా! మాదిగ వోటెలుకి అందరూ పోదామురండి. అంటు లేదు. గింటు లేదు. బ్రాహ్మణ కాఫీ, భోజన హోటలుకి పోతుండ్లా ఆమాదిరి అందరం వాల్ల వోటలు పోదాము" అనే మారుపు జనాలల్లో రావల గానీ ఎన్ని వోటల్లైనా బెట్టొచ్చు.

పూరవం సాపకూడు బెట్టినరే. దానివల్ల యాం జరిగింది? తిన్నది అరిగేవరకి యాడోల్లు ఆడ సర్దుకున్నరు" అన్నడు.

"పెద్ద కులపోల్ల వోటెల్లు వున్నంతకాలం మాదిగ బోజన వోటెల్లు మనలేవు సార్.

ముద్దలో మెతుకుల మాదిరి మనుసులంతా కలిసుండే మంచిరోజు రావాల. వన బోజినాలకి 'యే కులాని ఆ కులం విడిగా కట్టగట్టుకోని బోకుండా అన్ని కులాలు కలిసి బోజినాలు జేసే రోజు రావాలని ఎదురు జూస్తుండా సార్ ఎంతో ఆశతో మాట్లాడతా వున్నడు రాజారావు.

రాజారావు కలలు నిజం కావాలని కోరుకుంటా మనసులో దేవుడికి దండం బెట్టుకొని లేసొచ్చినా!